# హితోపదేశమ్ |

నూతిపళ్ళెం చేసుకున్న అదృష్టం చెప్పమంటారా? మార్నింగు టెం డలో, పెరట్లో మా నూతిపక్క లేడీస్ రవికల్ని విడిచేసి చీరల్ని విడవకుండా(బేచ్ ఆఫ్టర్ బేచ్)రాణిగారి తోటలో ఏపుగా పెరిగిన పూల మొక్కల్లా నీళ్ళోసుకుంటూ, సబ్బిళ్ళలరగదీస్తూ, యితరులు విడిచేసిన బట్ట లుతుకుతూ, ఎవరో తిన్న కంచాల్ని యింకెవరికోసమో వండిన అంట గిన్నెల్ని తొలుస్తూ, వీరిమీద వారూ, వారిమీద వీరూ నీళ్ళు జల్లుకుంటూ, వీపులు పరస్పరం రుద్దుకుంటూ, గాజులగరగరల్తో కోకిల్సమల్లెపాడుతూ, చిలకతల్లుల్లా కబుర్లుచెప్పుకుంటూ వుంటారు. ఎండదేవుడు వచ్చి ఆ బం గారు తల్లుల్ని వెచ్చగా తాకితే, ముంగురుల్తో ముచ్చట్లాడి బుగ్గమీద చిటి కేసి కవ్వించి నవ్వించి మరీ వెళ్తాడు మిస్టర్ గాలి. ఎండ చురుక్కు మని పొడిస్తే, గాలిపెట్టే గిలిగింతలకు ఒదుగుతూ ఒయ్యారాలు పోతూ, గడపలుదాటి నిష్క్రమిస్తారు భామలు, యిళ్ళల్లోకి తమ తమ ప్రేమ గూళ్ళల్లోకి.

స్నానాలు చేసొచ్చిన ఆడాళ్ళు కడిగిన ముత్యాల్లాగుంటారు. అలా వాళ్ళు సంపాదించుకునే ఫ్రెష్‌నెస్‌ని వాళ్లు పొయ్యిముందు ఖర్చుపెట్టే యక తప్పదుకదా—గృహిణికి యింట్లో ఫోర్సుడ్ లేబర్, చాకిరీ తప్పదు కదా— పాపం వాళ్ళ చాకిరీ వాళ్ళ మనసుల్ని అరగదీయకుండా వుంటే అలాటి ఆడాళ్లు పూజాపుష్పాల్లా మెరిసిపోతూంటారు. జుట్టు ఆరబెట్టు కుంటూ, వంగునీ కూర్చుని లేచీ, యిటూ అటూ పరిగెత్తి ఆ పనీ ఈ పనీ చేసుగునేసరికి, సబ్బిళ్ళలా అరిగిపోకుండా ఏ అమ్మాయి వుంటుందీ? రమణిముద్దులగుమ్మకి అదంతో కబుర్లు చెబుతూ కూర్చోడానికి వీలెక్క-

డిది? చీరకట్టుకున్నాక రవిక తొడుక్కోకుండానూ, పవుడరు రాసుకున్నాక తిలకం తీర్చిదిద్దుకోకుండానూ, వాగుతున్న రేడియోని కట్టేయకుండానూ, ఆగిపోయిన అలారం టైంపీసుకి కీ యివ్వకుండానూ, పక్కమీది జాజి పూలను దులిపేయకుండానూ, రాత్రి బెడ్ సైడున విడిచేసిన మెళ్ళోని గొలుసు, తలల్లోని పిన్నులూ-పిన్నీసులూ-రిబ్బనుముక్కలూ, మంచం కింది ఫలారం ప్లేటూ-మరచెంబూ, దిండు కింది సవరం, కాళ్ళకాడి దిక్కున ముడతలుపడ్డ బ్లాంకెట్, బ్లాంకెట్లో సిగ్గు విడిచేసిన లంగాలూ లుంగీలూ, రాత్రి చదువుతూ చదువుతూ మంచంకిందకు విసిరేసిన పుస్తకాలూ, పత్రికలూ అన్నీ ఎక్కడవక్కడ సర్దేసి లైఫ్‌ని నార్మల్ టోన్‌లోకి లాక్కురావడానికి రమణి ముద్దులగుమ్మకు ఎంత టైమూ, ఎనర్జీ కావాలో ఎవరైనా ఎప్పుడైనా ఆలోచించారా? నిప్పులకుంపట్లోపడ్డ రామచిలుకలాగా, మీ గృహరామచిలుక టపటపా కొట్టుకునే వేళ, ధూమ్రాక్ష ధూమకేతువుల్లాగా ఎగిరెగిరిపడ్డవే కాని మీరెప్పుడైనా కాసింత కనికారం ఆ ప్రాణిమీద చూపించారా? అటువంటివేళ రేజర్ కనపడలేదనీ, అండర్ వేర్ ఆరలేదని. కాఫీ చల్లారిందనీ, ఉప్మాలో ఉప్పెక్కువయిందనీ, కరివేపాకు సరిగా వేగలేదనీ, జీడిపప్పు మాడిందనీ, ఇడ్డెన్లు ఎర్రబడాయనీ, ఇంగువెక్కువైందనీ, టవల్ కనబడ్డంలేదనీ, బెల్టుకొక్కెం వూడిపోయిందనీ, షూ లేసులెక్కడికో పరిగెట్టాయనీ, దువ్వెన కనబడలేదనీ. గోలచేయడం మానరా? మానకపోతే మీలో అడ్జస్టు మెంటాలిటీ సున్నా బిగ్ జీరో అన్నమాట.

మీ ఆవిడ మీతో వేగుతోందంటే, ఆవిడ వెర్రి వేపకాయ అనుకునేరు. ముమ్మాటికీ కాదు. ఆవిడ పేషన్సుకి పరిపూర్ణా పిక్చర్ అన్నమాట! ఎలాగో చెప్పమంటారా? మీకు లాగు తొడిగి చొక్కా వేసి టోపీ పెట్టి బుగ్గమీద చిటికేసి, జోడు ఓ కాల్దో కాలికి తొడుక్కోకుండా చూసి, పర్సు జేబులోపెట్టి, వక్కపలుకూ తమలపాకులు చేతికందిస్తేనే బెస్ట్ వైఫంటారా? లేకపోతే రమణి ముద్దులగుమ్మ బిగ్ యాసా? మీరే

బిగ్ యాసులు. మీరంతా బ్రూటులే. రమణీలలామ ఎవరీమె అంటూ హీలవేసుకుంటూ వెంటబడ్డ మీరే, హీనంగా నలిపి నల్లేరుకాడను చేసి బంగారు పాపలాంటి చిన్నదాన్ని కంగారుపాపను చేసి గృహలక్ష్మిని గృహచీమగానో గృహబల్లిగానో మార్చేస్తారు. షీర్ ఎక్స్‌ప్లాయిటేషన్. ఆదర్శపు టిల్లాళ్ళకు సంసారంలో అట్టడుగున కనిపించేది హింసే— అహింసకు పైపూతే ప్రణయం, అహింసాత్మక ప్రణయాలు ఎక్కడా లేవు. దవుర్జన్యం చోటుచేసుకోని దాంపత్యాలు భూస్థలమంతా వెదికినా కనపడవు. అలంకారికులు కళాకారులు ఏవేవో చమత్కారమైన పేర్లు పెట్టి దాంపత్యజీవితానికి అట్టడుగున అంతార్వాహినిగా ప్రవహించే హింసాకాండను నైతికంగా సమర్థించారు. కోరికల్ని చంపుకోవడం హింసే, కోరికల్ని తీర్చుకోవడమూ హింసే—ఈ ఆధ్యాత్మికపుహింసలను సహించి బ్రతుక్కురావడమే సక్సెస్‌ఫుల్ జీవితం. జీవితానికి ఆడదానికైనా మగాడికైనా వున్నదొకటే కీ. దానిపేరే అడ్జస్టు మెంటాలిటీ- నిన్నటి మరకల్ని మనసుమీదపడకుండా చెరిపేసుకో! ఒకవేళ పడితే కన్నీళ్ళతో కడిగేసుకో.... రోజువారీ దవుర్జన్యాలనూ అత్యాచారాలనూ ఎవ్వరి ఉదయం నూతిగట్టున సబ్బుశ్ళెట్టి కడిగేసుకోకపోతే, నిత్యమల్లిపూవులా కలకలలాడుతూ, కిలకిలా నవ్వుతూ జీవితం నూతిపళ్ళాన్ని తాజాగా మజాగా వుంచడం ఎలా సాధ్యం? జీవితానికి నిన్న పట్టిన చీకటిలాటి మకిలిని నూతిపళ్ళెందగ్గర సబ్బునురగతో వదిలేయకపోతే ఫ్రెష్‌గా నిలబడి జీవితపు రసరామణీయకాల్ని ఆస్వాదించడం ఎలాగెలాగ?

అసలు పెళ్ళాం ఎంత తాజాగా, ఎంత సౌందర్య తిలకంలావున్నా, దాని బ్యూటీనంతా రొటీనుకింద లాగేసి మగాడు ఖాతిరీ ఆట్టేచేయడు. చాలామంది పతివ్రతామ తల్లులు మొగుడ్ని సేమ్ ఓల్డు డర్టీరోగ్ క్రింద కట్టేసి ఎడ్జస్టు మెంటాలిటీ కడు నైపుణ్యంగా ప్రదర్శిస్తారు. మనది మహాపతివ్రతల దేశంకదా— అంటే పతివ్రతలైనవారి సంఖ్య ఎక్కువగానూ, లేనివారి సంఖ్య తక్కువగానూ వుంటుంది. దీనినిబట్టి పతివ్రతగా

వుండటమే సులభం కాకపోవడంకంటె అని తేలుతోంది. పతివ్రతలు మెజారిటీకల దేశం కాబట్టి మనది పవిత్ర భారతదేశమయింది, మనం గోవునెంత హీనంగా చూస్తామో, ఆడదాన్నీ అంతే హీనంగా చూస్తాము. మనం పవిత్రమని భావించే వాట్నన్నిటికీ గోరీలుకట్టి మాత్రవే పూజిస్తాము. మన కంట్రీ బాగుపడాలంటే స్త్రీలను పవిత్రంగా పూజాపుష్పాల్లాకాదు చూడవలసినది. వాళ్ళను రక్తమాంసాలున్న మనుషులుగా గుర్తిస్తేచాలు. మొగుడిదగ్గర రొటీను బ్యూటీగా చలామణీ అయ్యేఆడది అందుకే నూతిపళ్ళెం దగ్గర ఒరిజినల్ విగరూ పొగర్తో వైలాపచ్చీసుగా కనబడ్తుంది. అదొక రేర్ పోర్ట్రెయిట్! ఆరేర్ పోర్ట్రెయిట్ నిభద్రంగా దాచుకోగలగాలి. సంసారపు గృహశిథిలాల్లో ఆ షాకిల్స్ మధ్య ఆడదాని నిజరూపాన్నిగుర్తించడంసాధ్యంకాదు. అందుకనేనేర్పుగాఅప్రయత్నంగా "వెన్ షి ఈజ్ ఫ్రీ అండ్ పుల్లీ హర్ ఓన్ సెల్ఫ్" చూడగలితే, మగవాడి జీవితం ధన్యమైనట్లే. కళాయి మాసిన బొక్కుఅద్దాలాటి మనసులు కల మగాళ్ళకు ఇల్లాలి ప్రతిబింబం అంతసులువుగా కంటికి ఆనదు. ది అన్ నోన్ సైడ్ ఆఫ్ ఎ పెళ్ళాంగురించి తెల్సుకోవడానికి ప్రతిమొగుడూ ట్రయిచేయాలి. ట్రయ్ అండ్ ట్రయ్ ఎగైన్ అన్నాడు కాళిదాసు! నూతిపళ్ళెవంటే ది అన్నోన్ సైడ్ ఆఫ్ ఎ పెళ్ళామ్సు రొటీన్ బ్యూటీ (ఈ వ్యాసంలోని ఇంగ్లీషు ప్రయోగాల్ను ఇంగ్లీషు మొగుళ్ళు అంటే ఇంగ్లీషు వచ్చినవారనే అర్థం! ఇంగ్లీషురాని తమతమ భార్యలకు ఏకాంతమందు చక్కగా బోధపర్చాలని నా ఉద్దేశం. వైన్ వెర్సాకూడాను.)